స్కెచ్

# నిరాహార దీక్ష విరమణ

ద్రోణంరాజు కృష్ణమోహన్

"వద్దు...వద్దు...అంతపని చెయ్యకుసుమీ" అని మొత్తుకుంటున్నా వినక మా పరంధాముడు పత్రికలో ఆకాస్త ప్రకటనచేసి మరీ పూరుకున్నాడు. విశాలాంధ్ర ఉద్యమం యిటీవల ఆంధ్రలో ఒక్కసారిగా విజృంభించి హర్తాళ్ లు, ప్రదర్శనలు, జరిగి పత్రికలనిండా ప్రకటనలుపడి, ప్రజలు యావన్మంది గందరగోళంలోవున్న సమయంలో మా పరంధాముడు తనుకూడా బ్రతికున్నానంటూ మళ్ళీ ఒక్కసారి పత్రికల కెక్కేడు.

"విశాలాంధ్రకు అనుకూలంగా ఫిబ్రవరి ఐదులోగా కేంద్రప్రకటన కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష" అంటూ ప్రముఖ ప్రజాసేవకుడు, సంఘ సంస్కర్త, గోవా ఉద్యమ సహాయకుడు, మాజీ ఆంధ్రరాష్ట్ర ఉద్యమ స్థానిక నాయకుడు, అయిన శ్రీ పరంధామయ్యగారి ప్రతిజ్ఞ. సభలో పూలమాలలు, సత్కారం! పత్రికలలో ప్రకటన, ఫొటో సహిత ప్రచురణ.

హడిలిపోయాం ఈడీసారి తప్పక చచ్చి వూరుకుంటాడని. వెనుక 1952 ఎన్నికలప్పుడు కాంగ్రెసు సంఘం తన యోగ్యతలను, అర్హతలను తోసిపుచ్చినందుకు నిరసనగా కాంగ్రెసు సంస్థలోని కల్మషం కడిగివేసేందుకు మూడున్నర పూటలు కాంగ్రెసు కార్యాలయం ఎదుట ఉపవసించి ఆఫీసు కార్యదర్శి, గుమాస్తా, బంట్రోతు మున్నగు ప్రముఖ కాంగ్రెసు వాదుల కోరికపై, కాదు ప్రార్థనపైనను, స్థానిక అగ్రనాయకుల రహస్య హామీలవల్లను, దీక్ష విరమించినట్లు తక్షణమే పత్రికలకి తంతివార్త పంపించి తెల్లవారి అదిచూసుకుని మరీ ఐదు ఇడ్డెన్లు, రెండు పెసరట్లు, కప్పున్నరకాఫీ సేవించాడు. ఆ సాయంత్రం సన్మాన సభ జరిగింది. ఆంధ్రోద్యమ సందర్భంలో రైల్వేస్టేషన్‌లో ప్రవేశించి ధైర్యంగా డ్రైవరులేని ఇంజను ఎదుట పట్టాల కడ్డంగా కూర్చుని, యీ విషయం పత్రికలలో వేయించుకున్నాడు. బళ్ళారి ఉద్యమ సందర్భంలో అక్కడకువెళ్ళి ఉపవాసదీక్ష ప్రకటించి పరిసర ప్రాంత కాంగ్రెసు నాయకుల అభ్యర్థనలపై చివరి నిముషంలో విరమించుకున్నాడు. గోవా వుద్యమంలో పాల్గొనేందుకు వెళ్ళేసరికి తీరా అది ఆపేశారు. ప్రాథమిక ఉపాధ్యాయులు, బియ్యపు ఫ్యాక్టరీ కార్మికులు తమ కోర్కెలు విన్నవించుకోవడానికి వీడి దగ్గరకి రావడం, వీడు "మీకేం భయంలేదు. మీ న్యాయమైన హక్కుల సాధనకోసం నేను రేపటి నుంచీ ఉపవసిస్తానని" హామీయివ్వడం దానితో వారు హడిలి పారిపోవడం (బాధ్యులు తామేనని బుజువై క్రిమినల్ కేసు ఎదుర్కోవాలన్న భయంతో) సంభవించింది. వీడిని, వీడి నిరాహార దీక్ష ప్రకటనలను, అదుపులో వుంచుదామంటే మాకు శక్యం కాకుండా వున్నది. భగవంతుని దయవలన ఆ కాంగ్రెసువారు, ప్రజాపార్టీ వారు యిత్యాదివారలు కల్పించుకుని వాడి ప్రాణాలను కాపాడుతున్నారు కాబట్టి సరిపోయిందిగాని — అన్నట్లు ప్రజాపార్టీ అంటే గుర్తొచ్చింది. వాడు యీ మధ్య ఏడాది క్రితం జరిగిన ఎన్నికలలో కూడా కాంగ్రెసు అభ్యర్థిత్వం దొరకనందున, ప్రజాసేవకు అవకాశం చిక్కక ప్రజాపార్టీలో చేరి పనిచేయడం మొదలెట్టేసరికి అది కాస్తా కాంగ్రెసుతో పొత్తుకలిపి కూర్చుంది-ఇక అసలు విషయం. ఇలా వివిధ రాజకీయపక్షాలు వాడిని ఒక కంట కనిపెట్టి ప్రమాదం సంభవించకుండా తగు జాగ్రత్త పడుతున్నాయి.

ఏదో ప్రారంభించి ఎందులోకో దిగాను. ఇంతకు వాడు మా మాట వినక, మొర ఆలకించక పత్రికలలో ఆమరణ నిరాహార దీక్ష గురించి ప్రకటన చేశాడు. ఫిబ్రవరి ఒకటి సాయంత్రానికి రాలేదు. 2, 3, కూడా లేదు. 5వ తేదీ వెళ్ళిపోతోంది. దిగులుగా వున్నది మా అందరికీ. ఈ మాటు చాలా భీషణ ప్రతిజ్ఞ చేశాడు. కాంగ్రెసు, ప్రజాపార్టీ, సోష

లిస్టు, నాయకుల మాటలేమాత్రం వినేటట్లు లేదు.

ఆరవ తేదీ ఉదయం మామూలుగా మిత్రులం ముగ్గురం అలవాటుగా కాఫీహోటల్‌కి బయలు దేరాం. ఎదురుగూడా చెట్టుక్రింద పరంధాముడు ఒక మంచం వేసుకు పడుకున్నాడు. చుట్టూరా అట్టలు తగిలించి వున్నాయి."విశాలాంధ్రకావాలి." "తెలంగాణాలో హృదయపరివర్తన రావాలి" యిత్యాదయః—గుండె ఆగిపోయిందనుకోండి.

"మొదలెట్టావ్?" నేను అడిగాను.

"తిరుగులేదు!" ఖచ్చితంగా చెప్పాడు- ఏం చేస్తాం? వివిధపార్టీల కార్యాలయాల వద్దకు పరుగెత్తాం. ఎవరయినా నా మాట పట్టించుకుంటేనా? సాయింత్రం వరకు పరిస్థితిలో మార్పులేదు. బ్రతిమాలు కున్నాం.

"ఊహుఁ..." మరో రెండు రోజులు గడిచాయి. పాపం పొసు తగ్గాడు! 9వ తేదీలోగా ఆంధ్ర మంత్రుల ఆశాపూరిత ప్రకటనలు వెలువడ్డాయి. కేంద్రమంత్రులు పెద్దగాష్ట్రిు మంచివన్న అభిప్రాయాలు వెల్లడించారు. తిరిగి.

"ఏం యిప్పుడయినా?" కదిపాం.

"ఆలోచిస్తాను" అన్నాడు. హమ్మయ్య! పరవాలేదు. బ్రతుకుతాడన్న ధైర్యం కలిగింది. ఢిల్లీలోని కాంగ్రెసు అగ్రనాయకుల విజ్ఞప్తులు (భాషా రాష్ట్రవాదులకు) అమృత్‌సర్ మహాసభలు గురించి చదివాడు.

"తప్పక విశాలాంధ్ర వస్తుంది. నాయకులు సుముఖంగానే వున్నారు. ఈ నెలాఖరులోగా ప్రకటన" పత్రికలలో తాజావార్తలు. ఆ మాట్యాన్నమే తిరిగి వాడిని కలుసుకున్నాం.

"నాకు విశ్వాసం కుదిరింది. నాయకులు చాలా తొందర పనులలో నిమగ్నులయినారు. బొంబాయి కల్లోలాలవంటివి జరగకూడదు. నా మరణంద్వారా ఆంధ్రదేశంలో ప్రళయం సంభవించవచ్చు. శాంతి భద్రతలు, దేశరక్షణ, జాతీయ నాయకుల అభ్యర్థనలూ, పత్రికలోని తాజావార్తలు మున్నగువాటి దృష్ట్యా నా ఆమరణ నిరాహార దీక్ష విరమించుకుంటున్నాను. తెలంగాణాలో పర్యటనకై బయలు దేరుతున్నాను" అని విలేఖరుల గోష్ఠిలో తెలిపాడు సాయింత్రం.

కాని యీ పత్రికలకి మహా ఎగతాళిగా వుంది పీడంటే. దీక్ష ప్రారంభిస్తున్నట్లు వార్త వేశారు గదా, విరమించినట్లు కూడా వేసుకో కూడదూ? (ఫోటో సహితం) పీడి నిజాయితీని బహుశా అవి శంకించి వుంటాయి! వాళ్ళ శంక సంగతి అలా వుంచండి. అసలు మా పరంధాముడు చచ్చాడో, బ్రతికాడో జనానికి తెలియొద్దూ? చచ్చాడని తెలిస్తే కల్లోలం బయలుదేరుతుందేమో నన్న ఆందోళన, భయంతో యీ పత్రికలు ఆ చావు వార్తని ప్రచురణకు నిరాకరించి వుంటాయన్న సందేహం ఆశేష ప్రజానీకానికి కలుగుతుంది కూడా.

పత్రికలు వేసుకోకపోతే మానె. మేం చెప్పుతున్నాంగా. పరంధాముడు చావలేదు. బ్రతికే వున్నాడు. ఆ చావాల్సిన దుర్గతి ఆ పొట్టి శ్రీరాములుకే సంభవించింది. కాని మా పరంధాముడికేం ఖర్మ వొచ్చింది. వాడి నిరాహార దీక్షలు సాగుతూనే వుంటాయి. విరమణలు కూడా వీటితో పాటే వుంటాయి. వాడు ఎన్నేళ్లు బ్రతకాలో అన్నేళ్లూ కొసరుతో మరీ బ్రతుకుతాడని వాడి తరఫున కూడా గట్టి హామీ యిస్తున్నాం.

---

ఫలవృక్షం ప్రతిసంవత్సరం ఒకే జాతి పళ్ళను కాస్తుంది; కాని ఒకే పళ్ళను కాయదు; ఏ పంట కా పంటలో కొత్త ఫలాలను అందిస్తుంది గదా! అదేవిధంగా శాశ్వతమైన విలువలను అందివ్వగలిగే సత్యాలు మానవ భావుకతలోంచి ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా జనిస్తూ ఉండాలి. కాని మనం నివసిస్తున్న ప్రస్తుత యుగంలో అవిశ్వాసం అనే చెట్టుకి మనకి తోచిన సత్యాలనే ఫలాలను తాడుతో కట్టి అవి చెట్టుకి కాచిన పండ్లనే అనుకుంటున్నాము. —(ఆల్బర్ట్ ష్వీట్జర్)